రచన
ఇంటింటిపత్రిక




## జయదేవ్ కార్టూన్లు



# రాయవరపు వి.ఎస్.ఎస్. సూర్యనారాయణ షష్ట్యబ్ది పూర్తి వినోద కథల పోటీ!

రచన ఇంటింటిపత్రిక

**రెండు ప్రథమ బహుమతులు : రు. 5,000/- x 2**
**రెండు ద్వితీయ బహుమతులు : రు. 3,000/- x 2**
**రెండు తృతీయ బహుమతులు : రు. 2,000/- x 2**

హాస్యం, వ్యంగ్యం, ఉత్కంఠ - ఈ మూడూ తగిన పాళ్లలో కలిసిన కథలు చదవడంలోని మజాకి వేసవి చవి మాజా కూడా సాటి రాదు. వీటిని అతి లేకుండా, గతి తప్పకుండా, సుతి మెత్తగా - స్తుత్యార్హం (సుత్తి కాదు) చేసినవారు అటు సాహిత్యంలోనూ, ఇటు చలనచిత్రరంగంలోనూ - ఒకరా, ఇద్దరా ఎందరో! పసిపాప నవ్వులా, పిల్లగాలి స్పర్శలా, వెన్నెలంత హాయిగా, అమాయకులకు ఆహ్లాదంగా, మేధావులకు మధురస్ఫురణగా - గిలిగింతలు పెట్టే చిరస్మరణీయమైన కథలు, సంఘటనలు తెలుగు సృజనావనిలో ఒకటా, రెండా ఎన్నో! ఆయా కథకులకు, రచనలకు దీటొచ్చే వినోద కథల్ని 'రచన' ఈ పోటీకి ఆహ్వానిస్తున్నది.

## రచయిత / రచయిత్రులకు సూచనలు

- కథాంశం వినోద ప్రధానమై ఉండాలి. కథలు వ్రాతప్రతిలో 5-10 పేజీలు ఉంటే ఉభయతారకం.
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం కాని రచనల్ని మాత్రమే పోటీకి పంపాలి. హామీపత్రం తప్పనిసరి!
- ఇ-మెయిల్ ద్వారా కథలు పంపినా, విధిగా పోస్టు ద్వారా పంపాలి. 'రచన' అచ్చు పత్రికని గుర్తుంచుకోవాలి.
- తగినన్ని పోస్టలు స్టాంపులు అంటించిన స్వంత చిరునామా గల కవరు జత చేసిన వారికి మాత్రమే ప్రచురణకు స్వీకరింపబడని కథలను త్రిప్పి పంపడం జరుగుతుంది. అయినా జెరాక్స్ కాపీలు ఉంచుకోవడం మంచిది – పోస్టల్ మిస్సింగ్స్‌ను దృష్టిలో ఉంచుకుని.
- కథలు సంపాదకుడు, 'రచన' పేరిట మాత్రమే పంపాలి. వ్యక్తుల పేరిట పంపడం నిషిద్ధం!
- బహుమతులు పొందని కథల్లో కొన్ని సాధారణ ప్రచురణకు స్వీకరించబడతాయి. ఆ వివరాలు 'రచన'లో ప్రచురింపబడతాయి. వాటికి ప్రత్యేకంగా పారితోషికం అంటూ ఉండదు.
- న్యాయనిర్ణేతలదే తుది నిర్ణయం. ఈ విషయంలో ఎలాంటి ఉత్తర ప్రత్యుత్తరాలకు తావు లేదు. ఇంతకుముందు కొన్ని సందర్భాలలో కొందరు కథకులు ఫలితాల ప్రకటన తర్వాత తమ కథలను ప్రచురింపవద్దని కోరారు. ఇది సత్సంప్రదాయం కాదు. న్యాయనిర్ణేతల నిర్ణయాన్ని ఆమోదించ యిచ్చగించని వారు పోటీలలో పాల్గొనకుండా ఉంటే మంచిది!
- కథకులు తమ చిరునామా; ఫోన్ నెం; ఇ-మెయిల్ వివరాలు స్పష్టంగా రాయాలి.
- పొట్టి పేర్లు, కలంపేర్లు ఉపయోగిస్తుంటారు కొందరు కథకులు. అంచేత చెక్కుల మీద రాయాల్సిన పేరు స్పష్టంగా తెలియజేయాలి.

**ముగింపు తేది : 22 అక్టోబరు, 2016**
**ఫలితాల ప్రకటన : డిసెంబరు, 2016**

**రచనలు పంపవలసిన చిరునామా :**

సంపాదకుడు, 'రచన' ఇంటింటి పత్రిక : 1-9-286/2/పి : విద్యానగర్, హైదరాబాద్ – 500 044

సంపుటి : 16
సంచిక : 7
అక్టోబరు : 2016

రచన ఇంటింటిపత్రిక

293

పేజీలు : 100
వెల : ` 30/-

ముఖచిత్రం :: నల్లనివాడు... :: చిత్రకారుడు : బాపు (జూలై, 1963)

చిరునామా : 1-9-286/2/P ; "యడ్లపాటివారి ఇల్లు" ; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర);
హైదరాబాద్ - 500 044 :: ఫోన్ : 040 - 2707 1500
ఇ-మెయిల్ : రచనపత్రిక@హాట్‌మెయిల్.కామ్ : రచనపత్రిక@జిమెయిల్.కామ్ :: దర్శించండి : డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.రచన.నెట్

సంపాదకీయం..... 5

## 'బాపు స్మరణీయం'

పేజీలు : 98

## సీరియల్ రచనలు

మనస్సాక్షి - బీనాదేవి 18
సిగుమాలినవాడు - క్రొవ్విడి లక్ష్మన్న 46

## శీర్షికలు

ఉత్తరరచన 6
పజిలింగ్ పజిల్ - 293
నిర్వహణ : సుధామ 8
కిరణ్‌ప్రభ కవిత - కరుణాకర్ రేఖాచిత్రం 30
మనలో మనిషి : డా॥ కుప్పా వెంకట రామశాస్త్రి
- కవన శర్మ 67
సాహితీ వైద్యం - వసుంధర 84

## కథలు

కథాపీఠం కథ ...
నల్ల ట్రంకు పెట్టె - శశి సారది 31
పెద్ద మనుషులూ... పూర్వీకులూ...
- మూలా రవి కుమార్ : జొష్టి వంశీకృష్ణ 60
అచ్చి నానమ్మా!
- రజనీ సుబ్రహ్మణ్యం 74
ఓ పువ్వు కథ
- యమున చింతపల్లి 79
వికాసం - ఐ. రాజ్‌మోహన్ 93

## కార్టూన్లు

జయదేవ్ 2

రుక్మిణి...... అక్కడక్కడక్కడా

**వచ్చే సంచికలో రచయితలు ..........**

**కవన శర్మ : ఎలక్ట్రాన్ : పాలెపు బుచ్చిరాజు**
**కె.వి. రమణరావు : సి.వి శాస్త్రి : నారాయణ గరిమెళ్ల తదితరులు**

ది వ్యూస్, ఒపీనియన్స్ ఎక్స్‌ప్రెస్‌డ్ అండ్ స్టేట్‌మెంట్స్ మేడ్ బై ది రైటర్స్, ఆథర్స్ అండ్ రీడర్స్ నీడ్ నాట్ నెసరిలీ బి దోస్ ఆఫ్ ది ఎడిటర్ అండ్ మేనేజిమెంట్ ఆఫ్ రచన ఇంటింటి పత్రిక. ఆల్ డిస్ప్యూట్స్ విల్ కమ్ అండర్ ది ఎక్స్‌క్లూజివ్ జ్యూరిస్‌డిక్షన్ ఆఫ్ రెస్‌పెక్టివ్ కోర్ట్స్ అండ్ ఫోరమ్స్ సిట్యుయేటెడ్ ఇన్ హైదరాబాద్ సిటీ ఓన్లీ.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా




రచయితలచే నిర్వహింపబడుతున్న ఏకైక పత్రిక!


**'రచన' కార్యాలయం**

**చిరునామా**

1-9-286/2/పి : విద్యానగర్
(రాంనగర్ గుండు దగ్గిర)
హైదరాబాద్ -500 044
ఫోన్ : 040 - 2707 1500

✪ ✪ ✪

*సంపాదకుడు*

**వై.వి.యన్.ఆర్.యన్.తల్పశాయి**

*అసోసియేట్ ఎడిటర్*

'హంసలేఖ'


## సంపాదకీయం

1991లో ఇప్పుడున్నట్లుగా కమ్యూనికేషన్ వ్యవస్థగానీ, సోషల్ మీడియాగానీ లేదు. ఉండుంటే ఇప్పుడు చాలామంది చేస్తున్నట్లు ఓ బ్లాగో, వెబ్ పత్రికో ప్రారంభించి ఉండేవాడినేమో! ఖర్చూ, శ్రమా రెండూ ఉండేవి కావు. అప్పుడు కేవలం పి అండ్ టి వారి ల్యాండ్ లైన్ మాత్రం ఉండేది. ఎస్‌టిడి వాడాలంటే చెవుల్లో మాటలు వినబడుతున్నా కళ్ల ముందు రూపాయి నోట్లు ఎగిరిపోతూ కన్పిస్తూ భయపెట్టేవి. కంప్యూటర్లు కూడా కొండమీదుండేవి. 'విశాఖ నుంచి పత్రికా? ఇంతవరకూ ఏదీ బ్రతికి బట్ట కట్టలేదు' అన్నవారే ఎక్కువ. అలాంటి రోజుల్లో ప్రారంభమైన 'రచన' అనేక ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచి, ఈనాడు పాతికేళ్ళు పూర్తిచేసుకోబోవడం విశేషమేగదా! అందుకే ఓ ఆత్మీయమిత్రుని సూచన మీద 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'కి శ్రీకారం చుట్టడం జరిగింది. తదాదిగా ఏదో తెలియని లోటు మనసును తొలిచివేస్తూ వస్తోంది.

రెండు వారాల క్రితం, ఓ బ్రాహ్మీ ముహూర్తాన జ్ఞానోదయమైంది. 'రచన'కు రక్తమాంసాదులతో రూపం కల్పించింది రచయితలు, చిత్రకారులే అయినా జీవం పోసి మనుగడ సాగించడానికి తోడ్పడింది రచనాభిమానులైన పాఠకవరేణ్యులే! ఆ కారణంగానే 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురణలో వారినీ భాగస్వాములను చేయాలనే సంకల్పం కలిగింది.

ముందుగా ఇ-మెయిల్‌లో అందుబాటులో ఉన్నవారికి ఈ వివరం తెలియపరచగానే చాలామంది స్పందిండం విశేషం!

ముఖ్యంగా మెసేజ్ వెళ్లిన నిమిషాల్లోనే బొమ్మన రమేష్ బాబుగారు పలకరించడం గురించి ముఖ్యంగా చెప్పుకోవాలి. కోల్‌కతా వాసి అయిన ఆయన ఈ మధ్యనే హైదరాబాదు వచ్చేననీ, స్వయంగా కలిసి 'రచన' పాతికేళ్ళ పూర్తిచేసుకోబోతున్న తరుణంలో ఏదైనా మంచి పని కోసం పాతికవేలిద్దామనుకుంటూ ఉండగా ఇ-మెయిల్ చూశాననీ, ఇక ఆలీశం చెయ్యకుండా కొద్ది రోజుల్లో వచ్చి కలుస్తాననీ అన్నారు. అన్నప్రకారం 16వ తేదీన సకుటుంబంగా వచ్చి రు.25,116/-కు చెక్ ఇచ్చేరు. మొదటిసారిగా 'రచన'ను విజయవాడ బుక్‌ఫేర్(1992)లో చూసి చందాదారులయ్యేరట. ఆ మీదట శాశ్వత చందాదారు.

ఆ దంపతులకు 'రచన' పట్ల ఉన్న అభిమానానికి చాలా ఆనందం కలిగింది. ఇలాంటి వారెందరో 'రచన'కు దన్నుగా నిలబడిన కారణంగానే ఇన్నేళ్లుగా పత్రికను నడపగలిగేనన్న విషయం సత్యదూరం కాదు.

ఆ సత్యం నాకు నిత్యస్మరణీయం!

ఆ వెనువెంటనే స్పందించిన వారు : మైనేని గోపాలకృష్ణ (హంట్స్‌విల్లి), కలశపూడి శ్రీనివాసరావు (న్యూయార్క్), శాయి రాచకొండ (హ్యూస్టన్), మదన్ పరిగి (ఉడ్‌స్టాక్), వేదుల చిన్న వేంకట చయనులు (వియన్నా) తదితరులు. మరికొందరు రచనాభిమానుల తొలివిడత స్పందన 'ఉత్తరరచన'లో చూడవచ్చును.

'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'కి ఈ సంచిక 'కర్టెన్ రైజర్'. దీన్ని రచనాభిమానులు అందుకుని స్పందించిన మీదట మాత్రమే ఒక నిర్దిష్ట అంచనాకు వచ్చేందుకు వీలవుతుందనుకుంటున్నాను. రచనాభిమానుల పట్ల నాకున్న అచంచల విశ్వాసం, వారికి 'రచన' పట్ల ఉన్న ఆదరాభిమానాలు సత్ఫలితాన్నిస్తాయన్నది ప్రగాఢ విశ్వాసం!

✪ ✪ ✪

ఈ సంచిక నుంచీ సుప్రసిద్ధ చిత్రకారుడు శ్రీ జయదేవ్‌గారి కార్టూన్ల ప్రచురణ రచనాభిమానులకు 'రచన' రజతోత్సవ సందర్భ ప్రత్యేక కానుక అనుకుంటున్నాను.

**293**

ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!

# ఉత్తర రచన

ఈ నెల 'రచన'లో మహా ఘనత వహించిన తపాల శాఖ వారి జన పీడన సేవా దుర్ఘటనల్ని వివరించారు. అవి కొన్ని మాత్రమే! రాత్రికి రాత్రి స్పీడ్‌పోస్ట్‌ని 25 నుంచి 39 చేసిన వీరసేవ వారిది. ఒకప్పుడు పియంజికి ఉత్తరం అందలేదని కార్డ్ రాస్తే వివరాలతో నాల్గవ నాటికి జవాబు వచ్చేది. ఇవాళ పరిస్థితిని మీరు చెప్పారు కదా!

మరో దారుణం చెబుతాను. చిన్న మొత్తాల పొదుపు పుణ్యమా అని ఇవాళ బహుశ ఆ శాఖ నెంబరు వన్ అవినీతి శాఖ అయింది. కౌంటర్లలో చిల్లర తిరిగి ఇవ్వక పోవటంలో వారు కొందరు బస్ కండక్టర్లతో పోటీ పడుతున్నారు!! కొన్ని ఆఫీస్లలో రిజిష్టర్డ్ ప్రింటెడ్ బుక్స్ బుక్‌పోస్ట్ అంగీక రించరు. నేను 'రూల్ బుక్' తీసి చూపిస్తే మేము తీసుకోలే మని నన్ను తిప్పిపంపారు. నేను పియంజికి ఫిర్యాదు చేస్తే... గాలికి పోయింది... జవాబు లేదు. రచయితల కష్టాలు రచయితలవి. మీరన్నట్లు చిన్న పత్రికల మనుగడని దెబ్బ తీసే కార్యదీక్ష కాబోలు!!!

మీ ఆవేదన కాపీని నేను పియంజికి పంపుతున్నాను. పాఠకులంతా ఈ పని చేస్తే... ఎలా వుంటుందో...

*– విహారి (హైదరాబాదు)*

మన 'రచన' సంచిక సంఖ్య – 291లో బీనాదేవిగారి కొత్త ధారావాహిక కథ, 'మనస్సాక్షి' ప్రారంభం నాలో నూతనోత్సాహాన్ని నింపింది. కాకపోతే, ఒక విషయంలో మనస్సు చివుక్కుమన్నది. 32వ పేజీలో, 12వ వరుసలో, "భవాని థర్డ్ ఫారం వరకే చదివింది" అని ఉన్నది. కానీ, 16వ వరుసలో, "పొరుగింట్లో టివి సీరియల్స్ చూస్తుంది" అని ఉన్నది. మన పాఠశాలల్లో, థర్డ్ ఫారం, తీసివేసిన సంవత్సరములో కూడా టివి లేదనుకుంటా.

సాహిత్యాభి నందనలతో...

*– పురాణం రామప్రసాద్ (హైదరాబాదు)*

*"ఉత్సాహో బలవా నార్య నాస్త్యుత్సాహోత్పరం బలం!*
*సోత్సాహస్య చ లోకేషు న కించిదపి దుర్లభం!"*

ఉత్సాహాన్ని మించిన గొప్ప బలం ఈ ప్రపంచంలో ఏదీ లేదు!

ఉత్సాహం ఉన్నవాళ్ళు సాధించలేనిదీ... ఏదీ లేదు!

ఇంతటి బృహత్ కార్యక్రమంకు మీరు నడుం కట్టడం చాలా ముదావహం. అందులో మమ్మల్ని భాగస్వాముల్ని చేయడం మా పూర్వజన్మ సుకృతం.

మా తండ్రిగారైన కీ.శే. జి.వి.చలపతిగారి వర్ధంతి సందర్భంగా నేను రూ.5,116/– పంపిస్తున్నాను.

మీరు తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావా లని శ్రీ పద్మావతి శ్రీనివాసులను పార్థిస్తూ...

*– జి.యస్. శేషబాబు (బెంగుళూరు)*

తప్పకుండా నేనూ ఈ పాతికేళ్ల పండగలో పాలు పోస్తా!

*– దేవరాజు వెంకట నరసింహారావు (హైదరాబాదు)*

'రచన' రూపంలో మీరు తెలుగు సాహిత్యానికి చేస్తున్న కృషి ఎనలేనిది. మీరు నాకు మీ బాంకు వివరాలిస్తే నేను కొంత వైర్ ట్రాన్సఫర్ చెయ్యగలను.

*– శాయి రాచకొండ (హ్యూస్టన్)*

*(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కున్న ఇబ్బంది తెలియజెప్పగానే సహృ దయంతో రు.25,000/–కు ఇక్కడి చెక్కు పంపినందుకు కృతజ్ఞతలు!* *– సం॥)*

రజతోత్సవ సంచిక యజ్ఞానికి నా అభినందనలు!

నా ఉడతాభక్తి సహకారం తప్పక ఉంటుంది.

*– మదన్ మోహన్ పరిగి (ఉడ్‌స్టాక్)*

ఒక అద్భుతం ఆవిష్కరింపబడుతోంది... మూడు తరాలకి!

*– బి.ఎన్. మూర్తి (సికిందరాబాదు)*

అభినందనలు! రజతోత్సవ సంబర సంకలనం సమా లంకారికంగా కనులకు విందుగా... మెదడుకు తిండిగా... మనసుకు పసందుగా రూపుదిద్దుకోవాలని... మీ, మీతోటి అనుభజ్ఞులైన రచయితలందరి సహాయ సహకారాలతో తప్పక రూపం దిద్దుకుంటుందని విశ్వసిస్తున్నాను.

*– కర్లపాలెం హనుమంతరావు (హైదరాబాదు)*

అభినందన వందనాలు! మీరు 'ప్రత్యేక సంచిక'గా మా రచనా సుందరి పాతికేళ్ళ ఉత్సవాన్ని వైభవంగా చేయ బూనడం నాకు చాలా ఆనందం కలిగించింది. ఆ బృహత్ యత్నంలో మమ్మల్ని కూడా భాగస్వామ్యులుగా చేయడం మరింత హర్షాన్ని పంచింది.

ప్రస్తుతం నేను అమెరికాలో ఉండడం వల్ల నేను పంప దలుచుకున్న విరాళం ఆన్‌లైన్ ద్వారానే పంపగలను. కానీ డిడి ఇండియా వచ్చాకనే పంపగలను. ఆన్‌లైన్ సౌకర్యం ఉన్నచో తెలపగలరు! మీ 'రచన' అభిమాని...

*– ఇవటూరి బాలా త్రిపుర సుందరి (ఇ-మెయిల్)*

*(ప్రకటించింది 'రచన' 'ప్రత్యేక సంచిక' కాదు. విడిగా పుస్తక రూపంలో వెలువడుతుంది. కేవలం విరాళప్రదాతలు మాత్రమే ఈ 'రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి'ని అందుకోగలరు. సొమ్ము పంపడం గురించి మీరడిగినట్లే చాలామంది అడిగేరు. కానీ... బ్యాంకు వారు సొమ్ము పంపినవారి పేర్లు స్టేట్‌మెంట్ ఆఫ్ ఎకౌంటులో చూపించలే మన్నారు. మా వన్నీ యూనీఫార్మ్ ఎమౌంట్స్ అయిన కార ణంగా ఎవరెవరు పంపినదీ తెలుసుకోవడంలో ఇబ్బందులు ఎదురౌతవి. అందువలన ఈ సదుపాయం ఉపయోగించు కోలేకపోతున్నాము. మీరు తిరిగి వచ్చిన తరువాతనే గువిధంగా స్పదిం చవచ్చును. – సం॥)*

వాఁవ్...! ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నాను.

నా లైబ్రరీలో బెస్ట్ ప్లేస్ రిజర్వు చేస్తాను.

ఇప్పటికీ నా దగ్గర ప్రారంభ సంచికతో పాటు అన్ని ప్రత్యేక సంచికలూ ఉన్నాయి.

*– కె. రమేష్ (బెంగుళూరు)*

మన 'రచన' రజతోత్సవ సంచిక గురించిన వివరాలు తెలిసాయి.

అప్పుడే పాతికేళ్ళు అయిందంటే ఆశ్చర్యంగా ఉంది.

మొట్టమొదటిసారి 'రచన' పత్రికను విశాఖ రైల్వేస్టేషన్‌లో కొన్నాను. రైల్లో అలా చదువుతూనే ఉన్నాను, విజయవాడ చేరేవరకు. 'ఇదేంటి ఇలాటి పత్రిక ఉందని నాకు తెలియదే!' అని కూడా అనుకున్నాను. కానీ బహుశా అది పత్రిక పెట్టిన తొలినాళ్ళలోదే అని అర్థమైంది. రైల్లో ఒకరు ఆ పత్రికను చూసి ఇస్తామని అడిగేరు ఆ రోజు. వారు కూడా 'చాలా బావుందండీ... ఎప్పటినుండి వస్తోంది?' అని అన్నారు. ఇదంతా మొన్నమొన్న జరిగినట్టే ఉంది.

పాఠకులను కూడా రజతోత్సవ సంచికలో భాగస్వామ్యు లను చెయ్యటం సంతోషంగా ఉంది.

*– నాదెళ్ళ అనూరాధ (విజయవాడ)*

*(మీ పదునైన జ్ఞాపకశక్తికీ, అభిమానానికీ ఆనందిస్తున్నాము. – సం॥)*

'రచన'(సెప్టెంబరు, 2016– 89వ పుట)లో వేసిన ఒక కూనలమ్మ పదం నాది.


మహా జ్యోతి భాతి
మణిద్యుతి రీతి
మెరిసె కృష్ణజ్యోతి
ఓ కూనలమ్మా
ఆనందకుమార్, కృష్ణాపురం
('జ్యోతి' : సెప్టెంబరు, 1963)

*('ఉత్తరాయణం' శీర్షికలో ప్రచురింపబడింది ఈ కూనలమ్మ పదం)*

నా పేరులో 'ఎ' అన్నది ఆనందకుమార్‌కి అక్షర సంకేతం.

దీని వెనుక ఒక కథ.

సంపాదకవర్గంలో నా పేరూ వుండేది.

ముఖ్యమైన పనులు చేసినది నండూరి రామమోహనరావు, రమణ, బాపు. కృష్ణాష్టమి సమయానికి వచ్చే సంచికను ప్రత్యేక 'కృష్ణజ్యోతి'గా తెస్తే బాగుంటుందన్న సలహా నాది. తర్జన భర్జనల తరువాత సరేనన్న నిర్ణయం తీసుకొన్నారు సంపాదకులు.

ఎంత అందంగా, హుందాగా, ఉన్నతంగా వచ్చిందో చెప్పలేను. అది త్రివేణీ సంగమం కాదు. వింశతి వియద్గంగల సంగమం. అయితే దీనికానాడు ప్రజామోదముద్ర లభించ లేదు. అంతకు ముందెన్నడు రాని సంఖ్యలో అమ్ముడుపోని ప్రతులు తిరిగి వచ్చాయట. 'ఇదంతా నీ వలనే!' అన్నట్లుగా నాతో ఆ విషయం చెప్పారు సంపాదకులు రామమోహనరావు.

ఆ కథ అంతటిలో ఆగలేదు. దాదాపు యిరవై ఏళ్ల తరు వాత కొనసాగింది; అదే సంచికను పునర్ముద్రించి మద్రాసులో విడుదల చేశారు. నన్ను పిలిచారు. వెళ్లాను.

నా మిడిసిపాటు నా చిరునవ్వే తెలిపి వుంటుంది.

ఆ మంగళాశాసనం నాకు కనకాభిషేకం, గజారోహణం, మహామహోపాధ్యాయ బిరుదు ప్రదానం.

*– వి.ఎ.కె.రంగారావు (మద్రాసు : 21-9-2015)*

*(మీ ఈ ఉత్తరం అందిన వెంటనే రొటీన్‌గా ప్రచురించాలని పించలేదు. అందుక్కారణం – మీ వివరణలో ఓ ప్రత్యేక రహస్యం ఇమిడి ఉన్న కారణంగా దాన్ని సరైన సమయంలో పాఠకుల ముందుంచాలనిపించడమే! ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైంది. మీ పూర్తి పేరు తెలిసిన నాబోటి కొందరికి ఆ రోజుల్లో 'కృష్ణసంచిక'లోని ఆ 'కూనలమ్మ పదం' మీదేనని తెలిసిందన్నది నిజం! 'ఆ సంచిక తయారీలో సింహభాగం పంచుకున్నాయనే ఇలా రాసేరేమిటి చెప్మా' అని ముక్కున వేలేసుకోకుండా ఆశ్చర్యపోయేం కూడా!*

*కొన్ని కొన్ని పాత విశేషాలు 'రచన'లో ప్రచురించినప్పుడు అందరికీ తెలియని ఇలాంటి చమక్కులు బయటపడుతున్నాయి. ఈ సంచిక ముఖచిత్రం మీ 'కృష్ణసంచిక' ప్రచార నిమిత్తం అప్పుడు బాపుగారు వేయగా దాన్ని న్యూస్‌పేపర్ సైజులో న్యూస్‌ప్రింట్ మీద ముద్రించి ఏజెంటులందరికీ పంపారు. మా ఊరి ఏజెంటు ఆచారి తన బడ్డీ కొట్టు ముందు దాన్ని నిలువెత్తున వ్రేలాడదీయగా చూసి బ్రతిమిలాడి రు.5/–కి కొనుక్కున్నాను. జాగ్రత్తగా దాచుకున్న దాన్ని 'జ్యోతి రజతోత్సవ సంచిక' (ఫిబ్రవరి, 1998) తయారీలో నేనూ భాగం పంచు కున్న సందర్భంలో మరోసారి పబ్లిసిటీ కోసం వాడడం జరి గింది. ఇప్పుడు 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' ప్రచురణ సందర్భంగా దాన్ని మక్కికి మక్కీ ('జ్యోతి' బదులు 'రచన' అక్షరాలుంచి) కాపీ కొట్టి రంగులద్ది వాడడం జరిగింది. – సం॥)*



తవ్వా రుక్మిణి రాంరెడ్డి

గత పాతికేళ్లుగా 'రచన'లో ప్రచురితమైన కార్టూన్లను నాలుగు పెద్ద అట్టపెట్టెల్లో భద్రపరచడం జరిగింది. 'రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి' కోసం వాటిని కార్టూనిస్టుల ప్రకారం వేరుచేస్తున్న సమయంలో కార్టూనిస్టు 'రుక్మిణి'గారు 14-9-2016న, 72 ఏళ్ల వయసులో, పరమపదించారనే వార్త అందింది.

అప్పటికి ఒక పెట్టెలోని వాటిని వేరు చేసిన ఆయన కార్టూన్లను లెక్కిస్తే 40 దాకా తేలేయి. మొత్తం 200 దాకా ఉంటాయేమో!

టి.ఆర్. రాంరెడ్డి 'రుక్మిణి'గారి అసలు పేరు. నాకు సమవయస్కుడు. మహబూబాబాద్ నివాసి. సంవత్సరం క్రితం ఇప్పుడిక్కడే ఓ దినపత్రికలో ఉద్యోగం చేస్తున్నాన్ని చెప్పి కలుస్తానన్నారు. కలవనేలేదు.

పూర్వం నాలుగైదుసార్లు మాత్రం కలిసేరు. చాలా మంచి వ్యక్తి.

ఆయనలో వామపక్ష భావాలు సమృద్ధిగా ఉండేవి. మన చుట్టూ ఉన్న సామాజిక రుగ్మతల పట్ల విపరీతమైన అసహనం, చిరాకు, కోపం ఉండేవి. అవి ఆయన కార్టూన్లలో విస్పష్టంగా గోచరమౌతాయి. ఆయన కార్టూన్లను కొన్నింటిని ఈ సంచికలో పునర్ ముద్రిస్తున్నాను. అవి మొదటగా ప్రచురితమై 15 ఏళ్లకు పైగా అయినా ఈ నాటి పరిస్థితులలో ఏ మార్పూ లేని కారణంగా తాజాగా అనిపిస్తాయి.

ఆయన కథకుడు కూడానూ! 'రచన'లో ఐదు కథలు రాసేరు.

అవి: లీల (ఏప్రిల్,1996) : గుమ్మడి కాయలు (ఏప్రిల్, 2002) : అవసరపడని వాళ్ళు (ఫిబ్రవరి, 2004) : ఫోటో స్టుడియో (మే, 2008) : హత్య (మే, 2009).

'రుక్మిణి'గారి భావజాలాన్ని గౌరవిస్తూ.....

– శాయి



# కిరణ్ ప్రభ

# చిటారు కొమ్మ చిరునామా

అముద్రిత (2006) కవితా సంపుటి (కవితా సంపుటి)

రేఖాచిత్రం



## ఓ అమ్మగా నేను...!

నువ్వు పలికే కొత్త కొత్త మాటలకి
అర్థాలు కూర్చే నిఘంటువునౌతా....!
నువ్వు అడిగే వింత ప్రశ్నలకి
జవాబులు వెదికే విజ్ఞాన సర్వస్వాన్నైతా....!
నువ్వు వేసే తప్పటడుగుల్ని సవరించేందుకు
నీ చుట్టూ చూపుల ప్రాకారం నిర్మిస్తా....!
ఎదురు దెబ్బలు నీ కెదురు కాకుండా
నా అరిచేతుల మీదుగా నీ అడుగులు వేయిస్తా....!
గాఢ నిద్రలో బూచాడు నీ దరికి రాకుండా
తీపి కలల ఉయ్యాలలో నిన్ను జోకొడతా...!
నువ్వు వికసించే రేపటి సౌధం కోసం,
పునాది రాళ్ళు పేర్చే నిత్య శ్రామికురాలినౌతా...!
ఇవన్నీ... ఎందుకంటే...
'అమ్మా' అని నువ్వు నన్ను అల్లుకున్నందుకు....!!
పేగు బంధమై నన్ను పెనవేసుకున్నందుకు....!!!

*(ఫిబ్రవరి, 2003)*

# నల్ల ట్రంకు పెట్టె

కథాపీఠం

**సామాన్యుల్ని ఆదుకుంటే దేవుడు చేదుకుంటాడు!** – వసుంధర

క్లినిక్ నుంచి మధ్యాహ్న భోజనానికి ఇంటికి వస్తుంటే వెనకే వచ్చాడు శ్రీను.

"అమ్మా! పేపర్లు ఇస్తారా?' అని అడిగాడు.

అతనిలా అడగడం మామూలే...నెల మొదటి వారంలో. అతనక్కడ ఉన్న ఇళ్లన్నింటికీ వెళ్లి, పాత పేపర్లు, పుస్తకాలు పనికిరాని సామాన్లు తీసికొని వెళ్తాడు.

ముందే అన్నీ సిద్ధం చేసి ఉంచాను. అందుకే, "నువ్వే తూకం వేసి. డబ్బు తెచ్చి ఇయ్యి" అంటే, "లేదమ్మా మీరు రండి. ప్రక్కనే కదా! ఎంత సేపవుతుంది?" అన్నాడు.

"సరే" అంటూ అతని వెంట వెళ్లాను. అతనన్నట్టే ఐదు నిమిషాలలో పని అయిపోయింది. అతని దగ్గర నుంచి డబ్బులు తీసుకుంటుండగా నా చూపు లోపల ఉన్న నల్ల ట్రంకు పెట్టె మీద పడింది. అది నాకు బాగా తెలిసిన, అత్యంత ప్రియమైన వస్తువులా అన్పించింది. దగ్గరగా వెళ్ళి చూసాను. 20, 30 సంవత్సరాల క్రితం హాస్టల్లో ఉండే పిల్లల కోసం ప్రత్యేకంగా తయారు చెయ్యించిన పెట్టెలా ఉంది. దానిపై అక్షరాలు చెరిగిపోయినా, 'స్నేహలత' అని ఆంగ్లంలో రాసిన పేరు లీలగా తెలుస్తోంది. ఒక్కసారిగా నీరసం వచ్చినట్టు, ప్రక్కనున్న స్థంభాన్ని పట్టుకొని నిలబడ్డాను.

"శ్రీనూ! నీకా పెట్టె ఎవరు అమ్మారు?" అని అడిగాను.

"ఇక్కడ చుట్టూ ఎన్నో బిల్డింగులున్నాయమ్మా! ఎవరిచ్చారో గుర్తులేదు" అని, నా ముఖాన్ని గమనించి, "మీకు తెలిసిన వాళ్లదామ్మా?" అన్నాడు.

శశి సారధి

"అవును! బాగా తెలిసినవాళ్లది. నువ్వు ఎలాగైనా గుర్తు తెచ్చుకొని, అది ఎవరి దగ్గర కొన్నావో చెప్పు! ఆ ట్రంకు తూకం వేసి ఎంత అయ్యిందో చెప్తే నేను తీసుకుంటాను" అని ఆ ట్రంకు పెట్టె స్వంతం చేసుకున్నాను.

ఇంటికి వచ్చిన తర్వాత ఏ పనీ చెయ్యలేక పోయాను.

'స్నేహలత' – ఆ పేరన్నా, ఆ పేరు స్వంతదారైన అమ్మాయన్నా, నాకెంతో అభిమానం. స్కూల్లో చదివేటప్పుడు అన్ని విషయాలలోనూ, స్నేహలతక్కని అనుకరించాలని చూసే దాన్ని. ఇప్పుడెలా ఉందో! అందానికి అందం, చదువుకి చదువు, ఆటలకి ఆటలు – అన్నింట్లోనూ ముందుండి నాకే కాదు మొత్తం విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచింది.

ఆమె బాడ్మింటన్ ఆడిందంటే, మెరుపులు మెరిసినట్టే ఉండేది. అంతర్ పాఠశాలల పోటీల్లో ఎప్పుడూ తమ స్కూలు జట్టే గెలిచేది. ఆమెకు తమ స్కూలు వాళ్ళు 'గోల్డెన్ హాండ్' అనే బిరుదు కూడా ఇచ్చారు. అయినా కించిత్ అతిశయం కూడా ఉండేది కాదు ఆమెకు.

రెండు రోజులయ్యాక శ్రీను రోడ్డు మీద కనిపించి, "ట్రంకు పెట్టె ఎవరిదో తెలిసిందమ్మా!" అన్నాడు.

అంతే! ఒక్క అంగలో అతన్ని చేరుకుని, "ఎవరిది?" అని ఆత్రంగా అడిగాను.

"వెనక వీధిలో శ్రీ వెంకటేశ్వర అపార్టుమెంటులో 302 నంబరు ఇల్లమ్మా!" అన్నాడు.

అంతే! వెంటనే అక్కడకు వెళ్ళడానికి తయారయ్యాను. బహుశా స్నేహలతక్క ఇక్కడే ఉండి ఉంటుంది. తన స్కూలు చదువు పూర్తయ్యేటప్పటికి, అక్క మెడిసిన్ చదువుతున్నట్టు తెలుసు. ఇప్పుడెలా ఉందో... ఇన్ని సంవత్సరాల తర్వాత పోలుస్తుందా?... చూడగానే కాకపోయినా, పేరు చెప్పగానే తప్పక గుర్తుపడ్తుంది. పల్లె, పట్నం కాని ఊర్లో తాము చదివిన మిషనరీ స్కూలుకు ఆ ప్రాంతంలో మంచి గుర్తింపు

ఉండేది. చుట్టుప్రక్కల గ్రామాల నుంచే కాక నగరాల నుంచి కూడా అక్కడకు చదువుకోవడానికి వచ్చేవారు. ఉన్నత విద్యా ప్రమాణాలతో బాటు, మంచి క్రమశిక్షణ, సత్‌ప్రవర్తన అబ్బుతాయని చాలామంది తమ పిల్లలను స్కూలు హాస్టల్‌లోనే ఉంచేవారు. అదిగో... అదే క్రమంలో నేను కూడా ఆ స్కూలుకి చేరింది.

ఎప్పుడూ ఇల్లు వదలని నాకు చాలా బెరుగ్గా ఉండేది. పెద్ద హాల్‌లో పన్నెండో, పదిహేనో మంచాలు ఉండేవి. హాలుకి ఆనుకుని గ్రిల్స్‌తో ఉన్న పొడవాటి వసారా ఉండేది. అక్కడే అందరి ట్రంకు పెట్టెలు ఉండేవి. అప్పుడే మొదటిసారి స్నేహలతక్క నల్ల ట్రంకు పెట్టెను చూసింది. అందరి పెట్టెలకు భిన్నంగా, పెద్దగా ఉన్న ఆ పెట్టె నన్నెంతో ఆకర్షించేది. 'అన్ని పెట్టెలు సైనికులైతే, ఈ నల్ల ట్రంకు పెట్టి రారాజు' అనుకునేదాన్ని.

సాయంత్రం అందరూ ఆడుకోవడంలో లేదా కబుర్లు చెప్పుకోవడంలో మునిగి ఉంటే అక్క మాత్రం కిటికీ ప్రక్కగా ఉన్న, ఎత్తైన తన పెట్టె మీద కూర్చొని చదువుకుంటూ ఉండేది. ఎవరి దగ్గరా లేని, అక్క దగ్గర మాత్రమే ఉన్న వస్తువు ఫ్లాస్క్! సాయంత్రం మెస్‌కి వెళ్ళి, దాంతో వేడినీళ్లు తెచ్చుకుని, హార్లిక్స్ కలుపుకుని త్రాగుతూ, చదువుకునేది.

అక్కని చూస్తుంటే, 'చందమామ' కథల్లోని రాజకుమార్తెలా అన్పించేది. అక్క ఏ పనైనా ప్రత్యేకంగా చేసేది.

అక్కడే అటూ, ఇటూ తిరుగుతున్న తనతో, "ఏం షీలా! ఆడుకోవడానికి వెళ్ళవా?" అనేది.

సుశీలను 'షీలా' అని పిలవాలని, అక్కకి మాత్రమే తట్టింది. దగ్గర వాళ్ళు నన్ను 'సుశీ' అని పిలుస్తారు కానీ, అప్పటికి, ఇప్పటికి నన్ను 'షీలా' అని పిల్చిన ఏకైక వ్యక్తి స్నేహలతక్కే!

నెమ్మదిగా అక్కతో పరిచయం పెరిగింది. ఒక రోజు, "ఏంటి లెక్కల్లో తప్పావంట?" అని అడిగి, సిగ్గుతో తలదించుకున్న నాతో, "పేపర్ ఇలా తీసుకురా!" అంటూ లెక్కలు చెయ్యించి, ఎక్కడ తప్పు చేసిందో చూపించి, మళ్లీ తప్పులు లేకుండా చెయ్యించింది. అప్పటి నుంచి, ఏ పాఠం అర్థం అవ్వకపోయినా, సాయంత్రం అక్క దగ్గరకే వెళ్లేదాన్ని. చదువుకుంటున్న పుస్తకం నుంచి బలవంతంగా కళ్లు ఎత్తి పాఠాలు చెప్పేది కాని, ఎప్పుడూ చిరాకు పడలేదు.

మొదటి అంతస్తులో ఉన్న ఆ గది కిటికీలోంచి, ఆడుకుంటున్న పిల్లలను చూస్తూ, అక్క ప్రక్కన నల్ల ట్రంకు పెట్టె మీద కూర్చొని, హార్లిక్స్ త్రాగుతూ చదువుకోవడం, ఆ వయసులో నాకొక అద్భుతమైన అనుభూతి.

నేను స్కూల్లో చేరేటప్పటికే అక్క 10వ తరగతి చదువుతోంది. అప్పట్లో స్కూల్లోనే 12వ తరగతి వరకూ ఉండేది. స్కూలు చదువు అయిపోయిన తర్వాత మెడిసిన్ చదవాలనేది అక్క ధ్యేయం. వాళ్ల నాన్నగారు డాక్టరు కావటం వలన, ఆయన్ని ఆదర్శంగా తీసుకొని, ఆయనలాగే, పేదలకు తన వైద్యంతో చేతనైన సాయం చేస్తానని చెప్పేది.

నెలలో ఒక ఆదివారం, విజిటర్స్ డే ఉండేది. అప్పుడు వాళ్ల నాన్నగారు, అమ్మ, తమ్ముడు వచ్చేవారు. అక్క ఆ స్కూల్లో ఆఖరి సంవత్సరంలో ఉండగా నన్ను తీసుకెళ్లి వాళ్లకి పరిచయం చేసింది. అక్క తమ్ముడు సురేష్ అప్పుడు 10వ తరగతి చదివేవాడనుకుంటా! పేంటులోకి షర్టు టక్ చేసి, టై, బూట్‌లతో ఉన్న సురేష్ నా కళ్లకు వేరే లోకంనుంచి వచ్చినవాడిగా అనిపించాడు. గడగడా ఇంగ్లీషులో మాట్లాడుతున్న అతన్ని విప్పారిన కళ్లతో విభ్రమంగా చూస్తుంటే, "నీ కళ్లు చాలా పెద్దవి" అన్నాడు.

తర్వాత అక్క చదువై వెళ్లిపోయింది.

మళ్లీ ఎప్పుడూ అక్కనిగానీ, తన కుటుంబం సభ్యులను గానీ, చూడలేదు. అయినా ఇప్పటికీ అద్దం ముందు నిలబడితే, 'నీ కళ్లు చాలా పెద్దవి' అన్న సురేష్ మాటలు గుర్తుకు వస్తాయి.

అప్పట్లో ఎప్పుడూ అక్క అడ్రస్ తెలుసుకోవాలని అన్పించలేదు. అంత ఊహ వచ్చేసరికి, ఎవర్ని అడగాలో తెలియలేదు. అలా స్నేహలతక్క దూరమైనా, ఆమె జ్ఞాపకాలు నాలో సజీవంగా ఉన్నాయి. అందుకే ఆ నల్ల ట్రంకు పెట్టెను చూడగానే, అప్పటి సంగతులన్నీ, గట్టు తెంచుకున్న నదిలా పరవళ్లు త్రొక్కుతూ బయటకు వచ్చాయి.

శ్రీను చెప్పిన ఇంటికి బయలుదేరాను. ఇంకాసేపట్లో అక్కను చూస్తాను అనే ఊహలో అడుగులు వడివడిగా పడ్డాయి. ఈ సమయంలో అక్క ఇంట్లో ఉంటుందో లేదో! పోనీ, ఎవరుంటే వాళ్లనే కలిసి వస్తాను. ఎవరూ లేకపోతే కనీసం ఇల్లైనా చూసి, అక్కడ వాచ్‌మేన్‌తో మాట్లాడతాను.

ఇలాంటి ఆలోచనలలో ఉండగానే ఇల్లు వచ్చింది. కంపిస్తున్న శరీరంలో ఆ ఇంటి గుమ్మం ముందు నిలబడ్డాను. 'హమ్మయ్య తాళం లేదు' అనుకుంటూ కాలింగ్ బెల్ నొక్కాను. ఐదు నిముషాలు అయ్యాక తలుపు దగ్గరకు ఎవరో

(మిగతా భాగం పత్రికలో చదవండి)

## చాలా ఏళ్ల తర్వాత సరికొత్త శీర్షిక!




## వచ్చే సంచికలో ప్రారంభం!

### చందాదారులు కండి!
### కొంత సొమ్ము ఆదా చెయ్యండి!

**విడి ప్రతి వెల : రు. 30/- :: యుఎస్ $ 7**

**స్వదేశీ చందా వివరాలు :**

24 సంచికలకు :: రు. 700 మాత్రమే!
(రు. 20 ఆదా!)

36 సంచికలకు :: రు. 1050 మాత్రమే!
(రు. 30 ఆదా!)

48 సంచికలకు :: రు. 1400 మాత్రమే!
(రు. 40 ఆదా!)

60 సంచికలకు :: రు. 1750 మాత్రమే!
(రు. 50 ఆదా!)

100 సంచికలకు :: రు. 2800 మాత్రమే!
(రు. 200 ఆదా!)

జీవిత చందా : రు. 7000 మాత్రమే!

**విదేశీ చందా వివరాలు :**

**సర్ఫేస్ మెయిల్ ద్వారా**

12 సంచికలకు - US $ 66 (US $ 18 ఆదా!)
60 సంచికలకు - US $ 330 (US $ 90 ఆదా!)
జీవిత చందా - US $ 400

**ఎయిర్ మెయిల్ ద్వారా**

12 సంచికలకు - US $ 105 (US $ 18 ఆదా!)
60 సంచికలకు - US $ 368 (US $ 90 ఆదా!)
జీవిత చందా - US $ 450

గమనిక : విదేశీ చందాదారులు తమ చందాను రూపాయలలో మాత్రమే చెల్లించాలి. వివరాలకు ఫోన్ (040-2707 1500) ద్వారా సంప్రదించండి.

### చందా కూపను

(కొత్త / బహుమతి / పొడిగింపు చందా)

పేరు :......................................................................................

పత్రిక పంపవలసిన
పూర్తి చిరునామా :
.......................................................
..............................................................................
..............................................................................
..............................................................................

సబ్ కోడ్ నెం.

సొమ్ము ` ..............................................................

చెక్/డి.డి./ఎం.ఒ.నెం.: ......................... తేదీ.................

మల్టీ-సిటీ చెక్/డి.డి. టు బి డ్రాన్
ఇన్ ఫేవర్ ఆఫ్ 'రచన'
పేయబుల్ ఎట్ 'హైదరాబాద్'

తేదీ : సంతకం

రచన ఇంటింటి పత్రిక 293

**1-9-286/2/పి**
రాంనగర్ గుండు దగ్గర; విద్యానగర్,
హైదరాబాద్ - 500 044
ఫోన్ : 040 - 27071500

ఇ-మెయిల్ ఐడి :......................................................................

## మనలో మనిషి

# డాక్టర్ కుప్పా వెంకట రామశాస్త్రి



(25 జూలై, 1916 :: 16 మార్చ్, 2000)

**మా**మామ్మ, బందర్ అని పిలవబడే మచిలీపట్టణంలో జబ్బు పడింది. మా నాన్న, నన్నూ మా అమ్మనీ తీసుకుని బందర్ వెళ్ళారు. అది 1945 అని గుర్తు.

"అబ్బాయికి చెప్పారా ?" అని మా నాన్నగారు అడిగితే, "చెప్పాము" అన్నాడు, సూరిగా పిలవబడే మా పెద్దన్నయ్య, సూర్యనారాయణ.

మా నాన్న బయటకు వెళ్ళాడు. తిరిగి వచ్చి, "అబ్బాయి ఇంకా రాలేదా?" అని మా నాన్న అడగటం, అమ్మ లేదని చెప్పటం జరిగింది.

కాసేపటికి ఇంటి ముందు జటకా ఆగింది.

అందులోంచి ఒక పెద్ద అతను దిగాడు.

"అబ్బాయి వచ్చాడు" అంది అమ్మ.

అబ్బాయి అంటే నాలాగా చిన్నగా కదా ఉండాలి! నాకు అప్పుడు 5 లేక 6 ఏళ్ళు ఉండి ఉంటాయి. ఈ అబ్బాయికి ముప్ఫయ్యో నలభయ్యో ఉంటాయి. మందుల సంచి తెరిచి, అమ్మ తెచ్చిన వేడినీళ్ళలో సూది కడిగి మామ్మకి సూది మందు ఎక్కించాడు.

అది నేను జ్ఞానం వచ్చాక అబ్బాయి అని అమ్మా నాన్నా వ్యవహరించే డాక్టర్ని చూడటం. అతనిపేరు వెంకట రామ శాస్త్రి. మా గోపెమ్మ అమ్మక్కయ్య కొడుకు. గొల్లపూడివారి అబ్బాయిని పెంచుకుందిట. ఈవిడ పెంచుకోవటం వలన ఆ అబ్బాయి కుప్పా అయ్యాడుట.

ఆ అబ్బాయిని మా అమ్మక్కయ్య ముద్దుగా 'అబ్బాయ్' అని పిలిచేది. నేను విన్నాను. మా అమ్మకు, నాన్నకు కొడుకు వరస కనక వీళ్ళూ అలాగే పిలవటం మొదలు పెట్టారుట. నేను మాత్రం 'శాస్త్రన్నయ్య' అని అనాలని – 'అబ్బాయి' అని అనరాదని, నేను అల్లా అన్నప్పుడల్లా కోప్పడి, మా అమ్మ నేర్పింది. అన్నయ్య భార్యని మేము సరస్వతొదిన అని పిలిచేవాళ్ళం.

గిర్రున మూడు ఏళ్ళు తిరిగేసరికి మా పెద్ద అన్నయ్య సూరికి సరస్వతొదిన మేనకోడలినిచ్చి పెళ్ళిచేశారు. దాంతో మా వరసలు తిరగబడ్డాయి. దాంతో సరస్వతొదిన పిన్ని అయింది.

ఈ రెండో వరస, మా రెండో అన్నయ్య పూర్ణ, మళ్ళీ, సరస్వతొదిన మరో మేనకోడలిని పెళ్ళిచేసుకోవటంతో గట్టి పడింది.

కుప్పా దంపతులకి ముగ్గురు పిల్లలు. పెద్దవాడు గోపాల కృష్ణ, రెండో సంతానం సుశీల, చివరి వాడికి రామస్వామి శాస్త్రి అని తాత పేరు పెట్టారు. గోపాలకృష్ణ నా కంటే కొద్దిగా చిన్నవాడు. అందుకనీ, కొత్త చుట్టరికం వలనా, మేము అన్న, వదిన అని పిలిచే వారి పిల్లలు మమ్మలిని అన్నలుగా వ్యవహరించటం మొదలు పెట్టారు. ఈ రెండు పెళ్ళిళ్ళకి మా శాస్త్రన్నయ్య దంపతులే మధ్యవర్తులు. రెండో అన్నయ్య పెళ్లి వారి ఇంట్లోనే జరిగింది. అప్పటికి అన్నయ్య కారు కొనుక్కున్నాడు. అన్నయ్య పురాణంవారి మనవడు. పురాణం తాతయ్య, కూతురు గోపెమ్మ అమ్మక్కయ్యకీ, మనవరాలు వెంకట రవణమ్మ(మల్లాది రామకృష్ణశాస్త్రి భార్య)కీ బుట్టయ్యపేటలో పక్కపక్కనే ఇల్లు కట్టించి ఇచ్చాడు. అన్నయ్య పెంచుకున్న చోట, ఇటూ అటూ డబ్బున్న వారి

**కవన శర్మ**



మనవడు. పైగా డాక్టరు. కాని పేదల డాక్టరుగా ఉండి డబ్బును అనుభవించని వాడు. సంపాదించని వాడు. 1952లో ఉన్న కారు తరవాత రెక్కలు వచ్చి ఎగిరి పోయింది.

అతను కమ్యూనిస్ట్ పార్టీ సభ్యుడు... జైలుకి వెళ్ళిన వాడు. ఆ కథలలో కొన్ని నాకు తరవాత మా అమ్మ చెప్తే తెలిసాయి. మరికొన్ని నేను బందరులో ఉద్యోగం వెలగ బెట్టినప్పుడు తెలిసాయి. అంటే అవి నేను మీకు చెప్పటానికి కొంత ఆగాలి.

1949 నాటికి మేము, మా బందరు గొడుగుపేట ఇల్లు అమ్మేసుకున్నాము. అప్పటి నుంచి ఇప్పటి దాకా కుప్పా వారిల్లే మాకు ఆ ఊళ్ళో వసతిగా మారింది.

విశాఖపట్నం చదువుల నిమిత్తంగాని, ఆసుపత్రి నిమిత్తం గాని మా చుట్టాలు ఎవరు వచ్చినా వారికి మా ఇల్లే వసతి. అప్పుడు హోటళ్ళు అంతగా లేవు. వాటిల్లో దిగడాలు లేవు. 1958లో కుప్పా గోపాల్ బియస్సీ బందరులో పూర్తిచేసుకుని ఎమ్మెస్సీ ఆంధ్రా యూనివర్సిటీలో చదవాలని విశాఖపట్నం వచ్చాడు. అతనితోపాటు శాస్త్రన్నయ్య కూడా వచ్చాడు. నేను ఇంజనీరింగ్ 3వ సంవత్సరంలోకి వచ్చాను. అప్పుడు అమ్మా, అన్నయ్య వాళ్ళ చిన్ననాటి విశాఖపట్నం కబుర్లు మొదలు పెట్టారు.

అన్నయ్య, ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎమ్‌బిబిఎస్ చదివాడు. అప్పుడు ప్రిన్సిపాల్ పేరు అబ్దేన్. జోగమ్మగారింట్లో ఒక భాగంలో, మా మామ్మ, పెదనాన్న, పెదనాన్న కొడుకులు ముగ్గురు, మా అమ్మా నాన్నా, మా అక్కలిద్దరూ ఉండేవారుట. నేను, అన్నయ్య చదువు మొదలు పెట్టేసరికి పుట్టలేదు. తరవాత కొన్నాళ్ళకి నెమ్మదిగా పుట్టాను. రెండో భాగంలో గోపెమ్మ అమ్మక్కయ్య, శాస్త్రన్నయ్య, సరస్వతి వదిన ఉండేవారుట. మా నాన్న ఆంధ్రా యూనివర్సిటీలో లెక్చరర్.

వాళ్ళ కబుర్లు, ఆనాటివి చెప్పుకుంటుంటే ఉత్సాహంగా విన్నాను.

“అబ్బాయి నువ్వు ఆ రోజుల్లో విద్యార్థి నాయకుడివి కదా?” అంది అమ్మ.

“అవును కక్కీ! మా ప్రిన్సిపాల్ అబ్దేన్‌కి అది ఇష్టం లేదు” అన్నాడు అన్నయ్య.

“అబ్దేన్ గ్రౌండ్స్‌లో ఇంటర్ కాలేజి క్రికెట్ పోటీలు

(మిగతా భాగం పత్రికలో చదవండి)

స్వంతదారు. సంపాదకుడు, ముద్రాపకుడు, ప్రచురణకర్త : వై.వి.యస్.ఆర్.యస్. శాయి :: దూరవాణి : 27071500
చిరునామా : ‘యద్దలపాటివారి ఇల్లు’ ; 1-9-286/2/పి, విద్యానగర్ ; హైదరాబాదు - 500 044
ముద్రణ : చరిత ఇంప్రెషన్స్, 1-9-1126/బి ; అజామాబాద్ ; హైదరాబాదు - 500 020

100 RACHANA ENTINTI PATRIKA (MONTHLY) : 0CT, 2016 : RNI NO. APTEL/2001/4453 : Postal Regn. No. H/SE-745/2015-2017
DATE OF PUBLICATION : 27-09-2016 :: DATE OF POSTING : 1st (or) 2nd of Every Month

# ‘రచన’ రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి

సాదా సీదాగా రజతోత్సవ సంవత్సరం దాటిపోదాం అనుకున్నా, ఓ ఆత్మీయ మిత్రుడి పట్టుదల కారణంగా రజతోత్సవ సంచికకు శ్రీకారం చుట్టక తప్పలేదు. ఒకసారి అంకురార్పణ జరిగిన తర్వాత ఆలోచనల పరిధి పెరిగి ఆ ప్రయత్నం వటుడింతై అన్న చందాన విస్తృతమైపోతోంది.

కేవలం కొన్ని ప్రముఖ రచనలను గుదిగుచ్చి తయారు చేయడం ఇలాంటి సందర్భాలలో పరిపాటి.

అలా కాకుండా పాతికేళ్ల ‘రచన’ ప్రస్థానాన్ని సవివరంగా అవలోకనం చేయాలన్నది మా అభిలాష!

✪ ✪ ✪

ఈ పాతికేళ్లలో ‘రచన’ను సుసంపన్నం చేసిన వారెందరెందరో......

వారందర్నీ సూచనామాత్రంగానైనా పేరు పేరునా తలచుకోవడం మా విధి, విద్యుక్తధర్మం!

ఈ సంపుటిలో గత పాతికేళ్లలో అందించిన శీర్షికల నమూనాలు; కొన్ని విలక్షణ రచనలు; కథలు; కార్టూన్లు; రంగుల బొమ్మలు; మరింకెన్నెన్నో విశేషాలు దర్శనమిస్తాయి. ఏతావాతా 294 సంచిక(1,224 రంగుల పేజీలతో కలిపి మొత్తం 30,440 పేజీలు)లలో ప్రచురింపబడిన రచనా సంపదను కేవలం నాలుగు వందల పేజీలలో చూపించబూనడం అసాధ్యమే అయినా కొంతలో కొంతయినా సాధ్యమనిపించేలా చేయగలమనుకుంటున్నాము.

‘రచన’ ఎందరో నూతన రచయితలతో సహా రచయితలుగా రూపాంతరం చెందిన పాఠకులకు వేదిక అయింది. వారందరూ ఈనాటికీ తమ సాహితీ సేవను కొనసాగిస్తున్నారు. అలాంటి వారి కథలూ తప్పక ఉంటాయి.

ప్రత్యేక కారణాల నేపథ్యంలో ఎంపికచేయబడిన కొందరు ప్రముఖుల కథలుంటాయి - ఆ నేపథ్య వివరణతో.

ప్రారంభం నుంచీ ‘రచన’తో మమేకమై విడదీయరాని అనుబంధమేర్పరచుకున్న ఇద్దరు ప్రముఖ రచయితల విపులమైన విశ్లేషణాత్మక వ్యాసాలు రెండు ‘రచన’ పాతికేళ్ల ప్రస్థానాన్ని సవివరంగా పరిచయం చేస్తాయి.

అలనాటి సాహితీ దిగ్గజాల సమూహ ఛాయాచిత్రాలు రెండు అదనపు ఆకర్షణ!

శ్రీపాద లాంటి సుప్రసిద్ధులైన కొందరు ప్రముఖ రచయితల అపురూప ఉత్తరాలు మరీ ప్రత్యేకం!

పద్దెనిమిదేళ్ల తర్వాత ఓ ప్రముఖ రచయిత రాసిన సరికొత్త కథ మరో విశేష ఆకర్షణ అయ్యే అవకాశం మెండుగా ఉంది,

ఎవరూ ఊహించలేని ఒక ‘విశేష విభాగం’ కూడా ఈ సంపుటిలో చోటుచేసుకోగలదనుకుంటున్నాము.

✪ ✪ ✪

ఈ సంపుటి మామూలు పత్రికగా కాకుండా ప్రత్యేకంగా పుస్తక రూపంలో ‘మంచి కాగితం’తో వెలువడుతుంది. ఇప్పటి ఉజ్జాయింపు అంచనా ప్రకారం ఈ సంపుటి 1/4 డెమి సైజులో 400 వందల పేజీలకు తగ్గదనుకుంటున్నాము. ఖర్చు మూడు లక్షల పైమాటే!

‘రచన’ను ఇన్నేళ్లుగా అక్కున చేర్చుకుని నిలబెట్టిన వారు రచనాభిమానులైన పాఠకులేనన్నది నిర్వివాదాంశం! అందుకే వారిని కూడా తప్పకుండా ఈ బృహత్ ప్రయత్నంలో పరోక్ష భాగస్వాములను చేయాలన్న సంకల్పం కలిగింది. ఈ ‘రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి’ని వారికి మాత్రమే పరిమితం చెయ్యాలని కూడా అనుకుంటున్నాము.

1, 5, 10, 15, 20 సంఖ్యలలో ఒకదానిని నూటపదహారు రూపాయలకు ముందు చేర్చి ఈ క్రతువులో భాగస్వామ్యం పొందవచ్చును. రచనాభిమానులు పెద్ద మనసుతో వితరణ చూపి ఈ సంపుటిని సొంతం చేసుకోగలరనే ఆశాభావం! ఆ విధంగా ఈ ‘రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి’ ప్రచురణలో రచనాభిమానులు సైతం పాలు పంచుకో వచ్చును. మీరందించబోయే పౌష్టికాహారం మాకు డిసెంబరు, 15 లోపల అందితే చాలు!

విదేశాల్లో ఉన్న రచనాభిమానులకు వారి ఇండియా చిరునామాకి మాత్రమే ఈ సంపుటి పంపగలము.

కొత్త పంటలు చేతికొచ్చే సంక్రాంతికి ఈ పుస్తక పంట కూడా మీ కరకమలాలను అలంకరించగలదు.

పాతికేళ్ల ‘రచన’ కృషికి దర్పణం పట్టడం మావంతు!

ఒక పత్రిక రజతోత్సవ సంచిక ఇలా కూడా ఉంటుందా అన్న చందాన ఆశ్చర్యపోవడం మీ వంతు!

‘రచన రజతోత్సవ విహంగ వీక్షణ సంపుటి’ ప్రచురణలో భాగస్వామ్యం కోసం

మీరు పంపదలచిన విరాళాలు మల్టిసిటీ చెక్/డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ‘రచన’ పేరిట పంపగలరు.